నవరత్నాలతో సంక్షేమ విప్లవం

● ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి


జవనడుకులో లబ్ధిదారులకు సంక్షేమ క్యాలెండర్ అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి

గుడిబండ: నవరత్నాల్లోని పథకాల అమలుతో రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ విప్లవం తీసుకొచ్చారని మడకశిర ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి అన్నారు. శనివారం మండల పరిధిలోని బూదిపల్లి, జవనడుకు గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి.. ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు అందాయా? అంటూ లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. మూడేళ్లలో ఆయా కుటుంబాలకు సంక్షేమ పథకాల వల్ల చేకూరిన లబ్ధిని తెలిపే బుక్‌లెట్లను అందజేశారు.

అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీల్లో 95 శాతం అమలు చేశారన్నారు. ప్రస్తుతం అర్హతే ప్రామాణికంగా వలంటీర్ల ద్వారా కుల, మత, రాజకీయాలకు అతీతంగా పథకాలు అమలు చేస్తున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ టీడీపీ కార్యకర్తలు, నాయకులకు కూడా సంక్షేమ పథకాలు అందజేసిన ఘనత సీఎం జగన్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి ఇటువంటి ముఖ్యమంత్రి పాలన చిరకాలం కొనసాగేలా దీవించాలని కోరారు. ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు ఆయన అనుచరులు అధికార దాహంతో, మోసపూరిత మాటలతో ప్రజలను నమ్మించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ విషయంపై అప్రమత్తంగా ఉండాలన్నారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందించిన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. అలాగే గ్రామాల్లో ఉన్న చిన్న చిన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే జవనడుకు గ్రామంలో ఉన్న తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని ఎంపీపీ, సర్పంచ్‌కు సూచించారు. కార్యక్రమంలో వక్కలిగ కార్పొరేషన్ డైరెక్టర్ నాగన్న, ఎంపీపీ రాధమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు భూతరాజు, ఎంపీడీఓ రామారావు, సర్పంచులు నరసమ్మ, యంజారేగౌడు,రంగస్వామి, సింగల్‌విండో అధ్యక్షుడు చంద్రశేఖర్, వైస్ ఎంపీపీ రత్నమ్మ, బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి కె.శివకుమార్, బీసీ, ఎస్సీ సెల్ కన్వీనర్లు పాండు, రమేష్, నాయకులు గిరిధర్, తిప్పేస్వామి, శివకుమార్, చిత్తయ్య, రమణ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.


ఉష్ణోగ్రత సమాచారం
(గరిష్టం)
హిందూపురం : 33.0
పెనుకొండ : 35.0
మడకశిర : 33.0

ఆర్డీటీ సెట్‌కు తుది గడువు ఈ నెల 10

మడకశిరరూరల్/పెనుకొండ/లేపాక్షి: ప్రభుత్వ పాఠశాలలు, ఏపీ రెసిడెన్షియల్, కేజీబీవీ, మోడల్ పాఠశాలల్లో చదువుతూ టెన్త్‌లో 500 మార్కులు పైగా సాధించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు ఆర్డీటీ సెట్‌కు దరఖాస్తు చేసుకోవచ్చని ఆర్డీ మల్లికార్జున, ఏటీఎల్స్ నారాయణస్వామి, లలిత, వన్నూరు స్వామి శనివారం వేర్వేరు ప్రకటనలో తెలిపారు. అర్హత సాధించిన విద్యార్థులు హాల్ టికెట్, మార్కుల జాబితా, రేషన్, ఆధార్ కార్డు జిరాక్స్, మూడు పాస్ ఫొటోలతో ఈనెల 10వ తేదీ లోపు ఆర్డీటీ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని తెలిపారు. వివరాలకు 9491355072, 8639303308 నంబర్లకు సంప్రదించాలన్నారు.

క్లుప్తంగా

ఘనంగా వాల్మీకి విగ్రహ ప్రతిష్ట


విగ్రహ ప్రతిష్టలో పాల్గొన్న ఎమ్మెల్సీ మంగమ్మ

పెనుకొండ రూరల్: మండలంలోని గొనిపేటలో శనివారం వాల్మీకి మహర్షి విగ్రహాన్ని ప్రతిష్టించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్సీ మంగమ్మ.. వాల్మీకి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం గ్రామ ప్రజలను అడిగి సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో వాల్మీకి నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ

పెనుకొండ రూరల్: మండలంలోని మునిమడుగు సచివాలయాన్ని తహసీల్దార్ స్వర్ణలత శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉదయం 11 గంటలైనా సిబ్బంది పూర్తిస్థాయిలో హాజరు కాకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. సకాలంలో విధులకు హాజరుకాకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం ఎంపీడీఓ శివశంకరప్ప కూడా సచివాలయాన్ని సందర్శించారు. సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించాలన్నారు.

తహసీల్దార్‌ను నియమించాలి


జెడ్పీ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ స్వారక్క

అమరాపురం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే తహసీల్దార్‌ను నియమించాలని జెడ్పీటీసీ సభ్యురాలు స్వారక్క అన్నారు. శనివారం అనంతపురం జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో సమస్యను అధికారులకు విన్నవించారు. నెలన్నర క్రితం ప్రస్తుతం ఉన్న తహసీల్దార్ సురేష్‌కుమార్ రోడ్డు ప్రమాదంలో గాయపడటంతో చికిత్స నిమిత్తం సెలవులో ఉన్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం పంట రుణాలు, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు, 1బీ, అడంగల్ తదితర వాటికి ఇబ్బందులు తలెత్తున్నట్లు తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి ఇన్‌చార్జ్ తహసీల్దార్‌ను నియమించాలని కోరారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

రొళ్ల: కర్ణాటక రాష్ట్రానికి చెందిన 7 మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వెంకటరమణ తెలిపారు. వివరాలు.. మండల పరిధిలోని కె.బ్యాడిగెర సమీపంలోని కర్ణాటక సరిహద్దులో శనివారం రంగసపల్లికి చెందిన సుంకప్ప అనే వ్యక్తి అక్రమంగా మద్యం ప్యాకెట్లను తరలిస్తూ పోలీసులకు పట్టుబడ్డాడు. అతడి నుంచి 7 మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

మేనేజర్‌కు సన్మానం


మేనేజర్ బసవరాజును సన్మానిస్తున్న దృశ్యం

అమరాపురం: స్థానిక కెనరా బ్యాంకులో సీనియర్ మేనేజర్‌గా విధులు నిర్వర్తిస్తూ ఇటీవల డివిజనల్ మేనేజర్‌గా ప్రమోషన్ పొందిన బసవరాజు శనివారం రిలీవ్ అయ్యారు. ఈ సందర్భంగా స్థానిక గ్రామస్తులు, దళిత నాయకులు, వ్యాపారులు, రైతులు ఉద్యోగులు, తదితరులు బసవరాజును శాలువా పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బ్యాంకులో అన్ని వర్గాల ప్రజలకు మేనేజర్ ఉత్తమ సేవలందించారని కొనియాడారు. అనంతరం మేనేజర్ బసవరాజు మాట్లాడుతూ.. డివిజన్‌లో మేనేజర్‌గా ప్రమోషన్ రావడం అదృష్టమన్నారు. ఈ ప్రాంతంలోని ప్రజలు, ఖాతాదారులు, రైతులు, వ్యాపారులు సహకారం అందించారని తెలిపారు. మంచి లావాదేవీలు చేయడంతోనే ప్రమోషన్ వచ్చినట్లు పేర్కొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం


రోడ్ షోలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వెంకటేష్

పావగడ: కాంగ్రెస్‌ను గెలిపిస్తే పావగడను అభివృద్ధి పథంలో నడిపిస్తానని స్థానిక కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి హెచ్.వి వెంకటేష్ అన్నారు. ఈనెల 10న స్థానిక విధాన సభ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో శనివారం ఉద్దండప్రన పాళ్య, చన్నసాగరదహట్టి, దేవర హట్టి, కొత్తూరు, సీఎన్ కోటి గ్రామాల్లో రోడ్ షో నిర్వహించారు. విస్తృతంగా ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా గుండార్లహళ్లిలో నిర్వహించిన రోడ్ షోలో వెంకటేష్ మాట్లాడారు. ఈ సారి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందన్నారు. నన్ను ఎమ్మెల్యేగా గెలిపిస్తే నిధులు రాబట్టుకుని తాలూకాలో మరిన్ని అభివృద్ధి పనులు చేపడతానని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మానం వెంకటస్వామి, నరసింహారెడ్డి, మైలప్ప తదితరులు పాల్గొన్నారు.

హంద్రీ-నీవా ద్వారా నీరివ్వాలి


మాట్లాడుతున్న జలసాధన సమితి సభ్యులు

చిలమత్తూరు: హంద్రీ–నీవా ద్వారా మండలంలోని చెరువులకు నీరు ఇవ్వాలని జలసాధన సమితి సభ్యులు డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో జల సాధన సమితి సభ్యులు ఓపీడీఆర్ శ్రీనివాసులు, చైతన్య గంగిరెడ్డి, వెంకటరామిరెడ్డి మాట్లాడారు. మండలంలో హంద్రీ–నీవా కాలువ వెళుతున్నప్పటికీ మండలానికి నీరు కేటాయించకపోవడం అన్యాయమన్నారు. 96 వేల ఎకరాలు నీరు లేక సాగు చేయలేకపోయారన్నారు. వైఎస్ రాజశేఖర రెడ్డి జిల్లా రైతాంగాన్ని దృష్టిలో ఉంచుకుని హంద్రీ–నీవా ప్రారంభించారని తెలిపారు. చంద్రబాబు మళ్లీ సీఎం అయిన తర్వాత ఎన్నికల సమయంలో ఆగమేఘాలపై నీరు వదిలారని తెలిపారు. అయితే మడకశిర, హిందూపురం ప్రజలకు అన్యాయం చేశారన్నారు. జల హారతుల పేరిట ప్రచారం చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కానీ నీరు కేటాయింపుల్లో అన్యాయం చేశారని మండిపడ్డారు. ప్రసుత్తం కాలువను వెడల్పు చేయించి, చిలమత్తూరు, గోరంట్ల మండలాలకు నీటి కేటాయింపులు చేయాలన్నారు. పందిపర్తి వద్ద రిజర్వాయర్ నిర్మించాలని డిమాండ్ చేశారు. కనీసం 60 టీఎంసీలు జిల్లాకు కేటాయిస్తే జిల్లా సశ్యశ్యామలం అవుతుందన్నారు. కార్యక్రమంలో సాధనసమితి సభ్యులు సిద్దారెడ్డి, పరిగి నవీన్, జమీల్ తదితరులు పాల్గొన్నారు.

8న బహిరంగ వేలం

మడకశిరరూరల్: మడకశిర నగర పంచాయతీలోని దినసరి మార్కెట్, వారపు సంత, బస్టాండ్ ఖాళీ స్థలం, మడకశిర చెరువులో చేపల పెంపకం, సుంకం వసూలు హక్కులను లీజుకు ఇచ్చేందుకు ఈనెల 8న ఉదయం 11 గంటలకు వేలం పాట నిర్వహిస్తున్నట్లు కమిషనర్ ప్రభాకర్‌రావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ధరావత్తు రూ.3 లక్షలు చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు. మరిన్ని వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

ఘనంగా సప్తమాత్రికల రథోత్సవం


రథోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్

చిలమత్తూరు: మండలంలో కొడికొండ కోటపై వెలసిన సప్తమాత్రికల అక్కమ దేవతల ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. శనివారం రథోత్సవం కనుల పండువగా సాగింది. ఉదయం నుంచే కోటపై వెలసిన అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. మధ్యాహ్నం కొడికొండ గ్రామంలో అమ్మవారం రథోత్సవాన్ని నిర్వహించగా.. ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. రథోత్సవానికి చుట్టు ప్రక్కల గ్రామాల నుంచే కాకుండా కర్ణాటకలోని గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు వచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీదేవమ్మ, రాజారెడ్డి, సుందరరాజు, ఎంపీటీసీ జగన్‌మోహన్ రెడ్డి, మండల కన్వీనర్ ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మార్కులకన్నా జీవితం గొప్పది

● పదో తరగతి విద్యార్థులు నిరుత్సాహానికి గురికావొద్దు
● ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్



హిందూపురం: పదో తరగతి ఫలితాల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులందరికీ ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ శనివారం ఓ ప్రకటనలో అభినందనలు తెలిపారు. విద్యార్థులకు ఎంతో బంగారు భవిష్యత్తు ఉందన్నారు. ఫెయిల్ అయిన విద్యార్థులు నిరుత్సాహానికి గురికావొద్దని సూచించారు. తక్కువ మార్కులు వచ్చినంత మాత్రనా నిరుత్సాహానికి గురై అఘాయిత్యాలకు పాల్పడటం తప్పన్నారు. మీపై మీ తల్లిదండ్రులు, కుటుంబం ఎన్నో ఆశలు పెట్టుకుని ఉంటారని తెలిపారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలకు ఇలాంటి సమయంలోనే మనోధైర్యాన్ని ఇవ్వాలన్నారు. జీవితం విలువను తెలియజేసి మరో అవకాశం కచ్చితంగా ఉందనే భరోసా నింపాలని సూచించారు. మార్కులే జీవితానికి ఆధారం కాదన్నారు. తాను డిగ్రీ సాధారణ మార్కులతో పాసైనట్లు వెల్లడించారు. అయినా పట్టుదలతో చదివి అందివచ్చినా అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఐపీఎస్ పాసై డీఐజీ, రాయలసీమ ఐజీ స్థాయికి చేరుకున్నట్లు పేర్కొన్నారు. సామాన్య టీచర్ కుమారుడిగా సాధారణ కుటుంబంలో చదివి ఉన్నత స్థాయికి చేరానని గుర్తు చేశారు. త్వరలోనే సప్లమెంటరీ పరీక్షలు రాసి, ఉత్తీర్ణత సాధించవచ్చని తెలిపారు.

ఓటు హక్కు వినియోగించుకోండి

పావగడ: ఈనెల 10న జరిగే విధాన సభ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకోవాలని స్థానిక ఈఓ శివరాజయ్య పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ఎస్ఎస్‌కే పాత ఛత్రంలో ఓటు హక్కు ప్రాధాన్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన బంధువులు, కుటుంబ సభ్యులు ఓటు హక్కును వినియోగించుకునేలా స్థానిక ప్రజలు కృషి చేయాలని కోరారు. మధుగిరి విభాగం కార్మిక శాఖ అధికారి తేజావతి మాట్లాడుతూ.. రాజ్యాంగ బద్ధంగా సంక్రమించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరు తప్పక వినియోగించు కోవాలన్నారు. 18 ఏళ్లు నిండిన వారందరూ తమ బాధ్యతగా ఓటు వేయాలన్నారు. ఎలాంటి ప్రలోభాలకు గురాకాకుండా అర్హులను ఎన్నుకోవాలన్నారు. మున్సిపల్ ముఖ్యాధికారి షంషు మాట్లాడాతూ.. వృద్ధులు, దివ్యాంగులు పోలింగ్ కేంద్రాల వద్దకు ఉచితంగా వెళ్లడానికి 5 ఆటోలను మున్సిపల్ శాఖ ఏర్పాటు చేసిందన్నారు.

'హైకోర్టు తీర్పు చంద్రబాబుకు చెంపపెట్టు'


ఏజీపీ భాస్కరరెడ్డి, పెనుకొండ

పెనుకొండ: అమరావతి రాజధాని పరిధిలో ఇళ్ల స్థలాలు ఉండాలని హైకోర్టు ఇచ్చిన తీర్పు చంద్రబాబుకు చెంపపెట్టు లాంటిదని ఏజీపీ భాస్కరరెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రాజధాని పేరుతో అనేక మోసాలకు పాల్పడ్డారన్నారు. అసలు పేద ప్రజలు అమరావతి ప్రాంతంలో ఉండకూడదని.. కేవలం కొన్ని సామాజిక వర్గాలు, బంధువులు, టీడీపీ నాయకులు, వ్యాపారులకు పప్పు బెల్లాల్లా భూములు అందించడంలో కీలకపాత్ర పోషించారన్నారు. దీనిపై స్పందించిన హైకోర్టు అమరావతి ప్రాంతంలో పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని తీర్పు ఇవ్వడం న్యాయవ్యవస్థపై ప్రజల్లో అపారమైన నమ్మకం కలిగించే విషయమన్నారు. న్యాయస్థానాలు ఎప్పటికీ న్యాయం వైపు, పేదలకు న్యాయం చేయాలన్న ఆలోచనతో ఉంటాయని గుర్తు చేశారు. దీనికి నిదర్శనం అమరావతి ప్రాంతంలో పేదలకు పట్టాలివ్వాలని హైకోర్టు తీర్పు ఇవ్వడమే అన్నారు. చంద్రబాబు పేదల పక్షపతి కాదన్నారు. అయితే అందుకు భిన్నంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పేదల పక్షాన నిలబడి పాలన సాగిస్తున్నారన్నారు. చంద్రబాబుకు ఇక రాజకీయంగా నూకలు చెల్లిపోయినట్లేనని జోస్యం చెప్పారు.

బీజేపీ విజయం ఖాయం


రోడ్ షోలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి నారాయణ స్వామి

పావగడ: ప్రధాని నరేంద్ర మోదీ దేశ వ్యాప్తంగా అనేక అభివృద్ధి పనులు చేపట్టి పురోగతి సాధించారని, బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని కేంద్ర మంత్రి ఏ.నారాయణ స్వామి తెలిపారు. శనివారం బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి కృష్ణానాయక్ తరపున పట్టణంలో భారీ రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. కరవు కాటకాలకు గురైన పావగడను సశ్యశ్యామలం చేయడానికి అప్పర్ భద్ర నీటి యోజనకు శ్రీకారం చుట్టింది బీజేపీ ప్రభుత్వమే అన్నారు. ప్రతి ఇంటికీ కొళాయిల ద్వారా తాగు నీటిని అందించే జేజేఎం పథకాన్ని ప్రవేశపెట్టినట్లు గుర్తు చేశారు. ఈసారి కూడా రాష్ట్రంలో స్పష్టమైన మెజారిటీతో బీజేపీ అధికారం చేపడుతుందని ధీమా వ్యక్తం చేశారు. బీజేపి అభ్యర్థి కృష్ణానాయక్‌ను అధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. అనంతరం ఆయన తాలూకాలోని మంగళవాడ తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమాల్లో బీజేపీ నాయకులు రవి శంకర నాయక్, డా.వెంకట్రామయ్య, అశోక్ కుమార్, జీటీ గిరీశ్, రవి, శివ కుమార్ సాకేల్, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ పోటీల్లో ప్రతిభ


ప్రశంసా పత్రాలను చూపుతున్న విద్యార్థినులు

చిలమత్తూరు: ఇటీవల తిరుపతిలో నిర్వహించిన ఏపీ సీఎం కప్ రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో ఉమ్మడి అనంతపురం జిల్లా విద్యార్థినుల జట్టు రన్నరప్‌గా నిలిచింది. టేకులోడు మహాత్మాజ్యోతిబా పూలే పాఠశాల విద్యార్థినులు పూజిత, విద్య, ఫిర్దోస్, సానియా ఉత్తమ ఆటతీరుతో జట్టు ఫైనల్ చేరేందుకు కృషి చేశారు. శనివారం మండల కేంద్రంలో విద్యార్థినులను అభినందించారు. కార్యక్రమంలో కోచ్ బాలాజీ, మాజీ ఎస్ఎంసీ చైర్మన్ సోము, నవాబ్ పాల్గొన్నారు.

వ్యక్తిపై కట్టెలతో దాడి

రొళ్ల: మండలంలోని కల్లురొప్పంలో రామప్ప అనే వ్యక్తిపై శుక్రవారం రాత్రి అదే గ్రామానికి చెందిన బల్లే కట్టప్ప, దాసప్ప మరో ముగ్గురు దాడి చేశారు. వివరాలు.. శుక్రవారం రాత్రి రామప్ప తన పొలం వద్దకు మోటార్ ఆన్ చేసేందుకు వెళ్లాడు. ఆ సమయంలో ఎలాంటి అనుమతి లేకుండా ఇసుకను ట్రాక్టర్‌లో నింపుతున్న బల్లే కట్టప్పతో మరో ముగ్గురిని అడ్డుకున్నాడు. ఆగ్రహించిన బల్లే కట్టప్ప, దాసప్ప మరో ముగ్గురు కట్టెలతో తనపై దాడి చేసినట్లు బాధితుడు రామప్ప తెలిపాడు. ఈ విషయమై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తానన్నారు.

'పది'లో మెరిశారు..

హిందూపురం టౌన్: 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. హిందూపురం మండల వ్యాప్తంగా 2871 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 1730 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. 60.25 శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు ఎంఈఓ గంగప్ప పేర్కొన్నారు. ఏపీఎస్ డబ్ల్యూఆర్ఎస్ బాలికల గురుకులంలో 89.74 శాతం ఉత్తీర్ణత సాధించారు. అలాగే మండలంలోని సీ.చెర్లోపల్లి ఆదర్శ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి, 64.21 శాతం ఉత్తీర్ణత సాధించారు. అలాగే పట్టణంలోని పలు ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించి సత్తా చాటారు. ఎల్ఆర్‌జీ విద్యాలయంలో 83.55 శాతం ఉత్తీర్ణత సాధించారు. పట్టణంలోని పాంచజన్య పాఠశాలలో 88 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు.

చిలమత్తూరు: పదో తరగతి ఫలితాల్లో మండల వ్యాప్తంగా 62.5 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ నాగరాజు తెలిపారు.

లేపాక్షి: మండల వ్యాప్తంగా పదో తరగతి పరీక్ష ఫలితాల్లో 59.20 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ నాగరాజు తెలిపారు. ఎస్ఎస్ఆర్ ఓరియంటల్ పాఠశాలలో 64.29 శాతం, కేజీబీవీలో 61.11 శాతం, చోళసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలో 51.76 శాతం, పులమతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 51.61 శాతం, కల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 50 శాతం సాధించాయని పేర్కొన్నారు.

మడకశిరరూరల్: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఈ ఏడాది టెన్త్ ఉత్తీర్ణత శాతం పెరిగింది. మండల వ్యాప్తంగా మొత్తం 959 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకగా.. 521 మంది ఉత్తీర్ణులయ్యారు. 54.32 శాతం ఉత్తీర్ణత నమోదైంది. మడకశిర ఉర్దూ పాఠశాలలో 8 మంది విద్యార్థులకు గాను 7 మంది పాసై 87.50 ఉత్తీర్ణత సాధించి మండల స్థాయిలోనే మెదటి స్థానంలో నిలిచింది. ఆమిదాలగొంది పాఠశాలలో 95 మంది విద్యార్థులకు గాను 53 మంది పాసై 56 శాతం ఉత్తీర్ణత సాధించారు. హరేసముద్రం పాఠశాలలో 46 మంది గాను 26 మంది పాసై 58 శాతం, గుండుమల పాఠశాలలో 24 మంది గాను 16 మంది పాసై 67 శాతం, వైబీహళ్లి పాఠశాలలో 36 మంది గాను 24 పాసై 66.67 శాతం ఉత్తీర్ణత సాధించారు.

సోమందేపల్లి: పదో తరగతి పరీక్షల్లో మండల వ్యాప్తంగా 68.58 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ ఆంజనేయులు నాయక్ తెలిపారు.

పరిగి: ఏపీఆర్ఎస్ గురుకుల పాఠశాలకు చెందిన మొత్తం 88 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 87 మంది పాసయ్యారు. 98.86 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ ఎన్వీ మురళీధర్‌బాబు తెలిపారు. మొత్తంగా మండలంలో 708 విద్యార్థులు పరీక్షలు రాయగా అందులో.. 476 మంది విద్యార్థులు పాసయ్యారని విద్యాశాఖ అధికారులు తెలిపారు. 67.27 శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు వెల్లడించారు.

పెనుకొండ: పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో 119 మంది విద్యార్థులకు గాను 69 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. 57.98 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ గంగప్ప తెలిపారు.

రొద్దం: మండలంలో 45.58 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ అంజనేయులు నాయక్ తెలిపారు. మండలంలో 541 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా అందులో 318 మంది విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు పేర్కొన్నారు. తురకలాపట్నం జెడ్పీహెచ్ హైస్కూల్ 70 శాతం ఉత్తీర్ణత సాధించారు. కేజీబీవీ పాఠశాలలో 80 శాతం ఉత్తీర్ణ నమోదైంది.

గోరంట్ల: మండల వ్యప్తంగా 19 ప్రభుత్వ, ప్రవేట్ పాఠశాలలకు చెందిన 1,025 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 630 మంది పాసయ్యారు. 61.46 శాతం ఉత్తీర్ణత నమోదైంది.

పెనుకొండ రూరల్: మండల వ్యాప్తంగా 433 మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా.. 206 మంది ఉత్తీర్ణులయ్యారు.

కుక్క దాడిలో ఐదుగురికి గాయాలు


చికిత్స పొందుతున్న భరత్

పెనుకొండ రూరల్: కుక్క దాడిలో ఐదుగురు గాయాల పాలయ్యారు. ఈ సంఘటన పెనుకొండ నగర పంచాయతీ పరిధిలోని రాజేశ్వరి కాలనీ, మహదేవపల్లిలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. శుక్రవారం రాత్రి కాలనీకి చెందిన భరత్, జయమ్మ, అనంత కుమార్, బాలు, గంగమ్మ ఆరు బయట నిద్రిస్తుండగా కుక్క దాడి చేసింది. ఈ ఘటనలో గాయపడిన వీరిని హుటాహుటిన పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స చేశారు.

8 నుంచి వేసవి విజ్ఞాన శిబిరాలు


అమరాపురం: పోస్టర్లు విడుదల చేస్తున్న ఎంపీడీఓ మునిస్వామి


పెనుకొండ: వేసవి విజ్ఞాన శిబిరం పోస్టర్ విడుదల చేస్తున్న గ్రంథాలయాధికారి, తదితరులు

అమరాపురం: స్థానిక గ్రంథాలయంలో ఈనెల 8వ తేదీ నుంచి జూన్ 11వ తేదీ వరకూ నిర్వహించనున్న సమ్మర్ క్యాంపు పోస్టర్లను ఎంపీపీ ఈరన్న, ఎంపీడీఓ మునిస్వామి శనివారం విడుదల చేశారు. విద్యార్థుల కోసం ప్రత్యేక తరగతులు, ఆటల పోటీలు, నీతికథల పుస్తకాల పఠనం, వ్యాసరచన పోటీలు, వక్తృత్వ పోటీలు నిర్వహిస్తామని గ్రంథాలయాధికారి తెలిపారు.

పెనుకొండ: పెనుకొండ శాఖ గ్రంథాలయంలో నిర్వహించనున్న వేసవి విజ్ఞాన శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయాధికారి మహబూబ్ బాషా కోరారు. శనివారం పట్టణంలోని గ్రంథాలయంలో ఆయన మాట్లాడుతూ.. వేసవి శిబిరంలో మహానుభావుల జీవిత చరిత్రలు, సైన్స్, క్విజ్, పురాణాలు, చరిత్ర, వంటి అనేక ఆసక్తికర పుస్తకాలను చదువుకుని విజ్ఞానం పెంచుకోవాలన్నారు. ఉదయం 9 గంటల నుంచి 11 గంటలు శిబిరం ఉంటుందన్నారు.

రొద్దం: మండల కేంద్రంలోని గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ప్రారంభించినట్లు గ్రంథాలయ శాఖ మండల అధికారి నాగరాజు తెలిపారు. ఆరో తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కథల పుస్తకాలు, సైన్స్ క్విజ్, పురాణాలు, చరిత్ర తదిత పుస్తకాలు చదివి విజ్ఞానం పెంపాదించుకోవాలని తెలిపారు.

లేపాక్షి: స్థానిక గ్రంథాలయంలో ఈనెల 8వ తేదీ నుంచి 11వ తేదీ వరకూ వేసవి విజ్ఞాన శిబిరాలు (సమ్మర్ క్యాంప్) జరుగుతాయని లైబ్రేరియన్ సి.జయసింహా రాజు తెలిపారు. రోజూ 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ శిబిరం నిర్వహిస్తామని పేర్కొన్నారు.

చిలమత్తూరు: పౌర గ్రంథాలయ శాఖ ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని గ్రంథాలయంలో సోమవారం నుంచి వేసవి విజ్ఞాన శిబారాలు నిర్వహించనున్నట్లు గ్రంథాలయాధికారి మల్లికార్జున పేర్కొన్నారు. పుస్తకాలను చదివించడంతో పాటు, క్విజ్, ఆటల పోటీలు నిర్వహిస్తామన్నారు. శనివారం తహసీల్దార్ నాగరాజు వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీటీ హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం టౌన్: స్థానిక శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను గ్రంథాలయాధికారి శ్రీధర్ ఆవిష్కరించారు. ఈనెల 8 నుంచి జూన్ 6 వరకూ వేసవి విజ్ఞాన శిబిరాలు ఉంటాయని పేర్కొన్నారు. గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు గంగాధర్, శాంతి జయప్రకాష్, ఉమర్ ఫారూక్, ఉపాధ్యాయులు శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

సోమందేపల్లి: గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 8 నుంచి జూన్ 11 వరకూ నిర్వహించే సమ్మర్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయాధికారి మహబూబ్ బాషా సూచించారు. శనివారం స్థానిక గ్రంథాలయంలో సమ్మర్ క్యాంప్ పోస్టర్‌లను విడుదల చేశారు. పుస్తక పఠనం చిత్రలేఖనం, స్పోకెన్ ఇంగ్లిష్ తదితర వాటిపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు.

హిందూపురం: వేసవి సెలవుల్లో విద్యార్థులు పిల్లలకు మంచి విషయాలను నేర్పించే విధంగా బాల వికాస వేదిక ఆధ్వర్యంలో ఈనెల 4, 5, 6 తేదీల్లో స్థానిక సరస్వతీ విద్యా మందిరంలో చిల్డ్రన్స్ క్యాంపు నిర్వహించడం జరిగిందని నిర్వాహకులు తెలిపారు. చివరి రోజు కర్ణాటక మధుగిరికి పోవు మార్గంలో ఉన్న డాక్టర్ హెచ్.నరసింహయ్య సైన్స్ సిటీ సందర్శనకు విద్యార్థులను తీసుకెళ్లారు. విజ్ఞాన యాత్రలో విద్యార్థుల అభిప్రాయాలు సేకరించారు. కార్యక్రమంలో బాల వికాస వేదిక కమిటీ సభ్యులు రంగనాయకులు, హేమావతి, చంద్రకళ, గీత, క్రాఫ్ట్ టీచర్ శారద, హిందూపురం బీఎస్ఎస్ ఇన్‌చార్జి మల్లిక్ దత్, వలంటీర్లు శ్రావణి, పూజిత తదితరులు పాల్గొన్నారు.

వాటర్‌ప్లాంట్ ఏర్పాటు


వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న జిల్లా జడ్జి శ్రీనివాస్

పెనుకొండ: పట్టణంలోని కోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన వాటర్‌ప్లాంట్‌ను జిల్లా జడ్జి శ్రీనివాస్ శనివారం ప్రారంభించారు. వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడానికి న్యాయవాదలు, కోర్టు సిబ్బంది, ఇతర దాతలు తీసుకున్న చర్యలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి శంకర్రావు, న్యాయమూర్తి ముజీబ్, ఏజీపీ భాస్కరరెడ్డి, న్యాయవాదుల సంఘం అధ్యక్షులు నాగరాజు, చంద్రశేఖర్‌రెడ్డి, ఆసిఫ్, వాల్మీకి శ్రీనివాసులు పాల్గొన్నారు.